## కన్నులపండువగా శ్రీలక్ష్మీవేంకటరమణ స్వామి కళ్యాణోత్సవం



కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**యల్లనూరు, మార్చి 22 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని కోటవీధిలో వెలసిన శ్రీలక్ష్మీవేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీలక్ష్మీవేంకటరమణస్వామి కళ్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. ఇందులో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటరమణస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాలు, సుగంధపుష్పాల నడుమ వేదపండితులు కళ్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కుప్పా వారి ఆధ్వర్యంలో స్వామివారి కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కళ్యాణాన్ని వీక్షించారు. హాజరైన భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కీ॥శే॥ కుప్పా వెంకటరామయ్య, అలివేలమ్మల కుటుంబసభ్యులు నవీన్, రాజీవ్, సరస్వతి, సురేష్, విశాలాక్షి, బాలసుబ్రమణ్యం, జయలక్ష్మి, గోపాలయ్య, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## బూత్‌లెవెల్ అధికారులతో ప్రత్యేక సమావేశం

**యాడికి, మార్చి 22 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో శనివారం బూత్‌లెవెల్ అధికారులతో తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. యాడికి మండలంలో పనిచేస్తున్న బూత్ లెవెల్ అధికారులు, సూపర్‌వైజర్లు ఎన్నికల క్లెయిమ్‌ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని, వారికి ఇచ్చిన లక్ష్యాలను త్వరితగతిన చేరుకోవాలని తహశీల్దార్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ కృష్ణప్ప, బూత్‌లెవెల్ అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



సమావేశంలో సూచనలు ఇస్తున్న ప్రతాప్‌రెడ్డి

## విశేష అలంకరణలో శ్రీరంగనాథస్వామి

**తాడిపత్రిరూరల్, మార్చి 22 ప్రభాతవార్త**



మండలంలోని ఆలూరు కోనలో వెలసిన శ్రీరంగనాథ స్వామి శనివారం విశేష అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. ఉదయం స్వామి వారికి అర్చకులు అభిషేకాలు, అర్చనలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామిని వివిధ రకాల పుష్పాలు, తులసి దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా కోనలో వెలసిన శ్రీఆంజనేయస్వామి, శ్రీషిరిడిసాయిబాబా ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. పెద్దఎత్తున భక్తులు కోనకు తరలివచ్చి శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీరంగనాథస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు జలపాతాల్లో స్నానాలు చేసి స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు నిత్య అన్నదాన సత్రంలో భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజినేయులు, సిబ్బంది కాశీ పాల్గొన్నారు.

## అగాపే ఆశ్రమంలో అన్నదానం



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

**యాడికి, మార్చి 22 ప్రభాతవార్త**

యాడికి మండల కేంద్రం కమలపాడు రోడ్డు, రాఘవేంద్రకాలనీలో వున్న అగాపే ఆశ్రమంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గొడ్డుమర్రి చిన్న రంగయ్య 9వ వర్ధంతి సందర్భంగా ఆయన భార్య రంగమ్మ, పెద్ద కుమారుడు రామ్మోహన్, కోడలు రోహిణి, చిన్న కుమారుడు సురేంద్ర, కుమార్తె శైలజ, మనవరాలు వేదశ్రీలు ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారికి ఆశ్రమ నిర్వాహకులు బత్తల ప్రసాద్, వృద్ధులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఫోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన

**పెద్దవడుగూరు, మార్చి 22 ప్రభాతవార్త**



విద్యార్థినిలకు అగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కాశీవిశ్వనాథ ఆచారి

మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలలోని విద్యార్థులకు శనివారం ఫోక్సో చట్టంపై గుత్తి సీనియర్ సివిల్ జడ్జి కాశీవిశ్వనాథ ఆచారి అవగాహన కల్పించారు. గుత్తి మండల న్యాయ సేవాసమితి, ఆరవ అదనపు జిల్లా జడ్జి శ్రీహరి ఆదేశాల మేరకు గుత్తి సీనియర్ సివిల్ జడ్జి కాశీవిశ్వనాథఆచారి వివిధ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం 2012పై, ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి కాశీవిశ్వనాథఆచారి మాట్లాడుతూ బాలబాలికలు ప్రతి ఒక్కరు మంచి స్పర్శలపై అవగాహన కలిగి వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ గంగాధర్, కెజిబివి స్పెషల్ ఆఫీసర్ ఉష, సోషల్ వర్కర్ బాలాజీ, టైపిస్టు సాదిక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

**యాడికి, మార్చి 22 ప్రభాతవార్త**

కామ్రేడ్ వికె వెంకటరామిరెడ్డి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 24వ తేదీ సోమవారం నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్‌రఫీ పిలుపునిచ్చారు. కామ్రేడ్ వికె వెంకటరామిరెడ్డి వర్ధంతి సందర్భంగా మండలంలోని వేములపాడు గ్రామంలో ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వికె అభిమానులు, సిపిఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## తాడిపత్రి పట్టణంలో పోలీసుల మోహరింపు



చిన్నబజార్‌లో పోలీసులు మోహరించిన దృశ్యం

**తాడిపత్రిటౌన్, మార్చి 22 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలో శనివారం పోలీసులు మోహరించారు. శుక్రవారం పట్టణంలోని 2వవార్డు చిన్నబజార్‌లో జరిగిన రాళ్ల దాడిని దృష్టిలో వుంచుకుని ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరి ఆధ్వర్యంలో దాదాపు 400 నుండి 500 మంది పోలీసులను పట్టణంలో మోహరించారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణంలో పోలీస్ పికెట్లను ఏర్పాటు చేసి కట్టుదిట్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు.

## నేడు శ్రీలక్ష్మీవేంకటరమణస్వామి రథోత్సవం

**యల్లనూరు, మార్చి 22 ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని కోటవీధిలో వెలసిన శ్రీలక్ష్మీవేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీలక్ష్మీవేంకటరమణస్వామి రథోత్సవాన్ని మేళతాళాలు, బాణసంచా నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు చేపట్టారు. స్వామివారి రథోత్సవంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని వారు కోరారు.

◄ శ్రీవారి రథం రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

## పదవ తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కమిషనర్ బాలస్వామి

**అనంతపురం మార్చి 22 ప్రభాతవార్త**



పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం నగర పాలక సంస్థ పరిధి లోని మొత్తం 33 కేంద్రాలలో పదవ తరగతి పరీక్షలు జరుగుచున్న తరుణం లో మారుతి నగర్ కేశవ రెడ్డి స్కూలు, గుడ్ చిల్డ్రన్ ఉన్నత పాఠశాలలో జరుగుచున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాలను నగర కమిషనర్ బాలస్వామి, ఎంఈఓ వెంకటస్వామి తో కలసి పర్యవేక్షించడం జరిగింది. ఈ పరీక్షా కేంద్రాలకు అవసరం మేర బల్లలను ప్రక్క స్కూల్స్ నుంచి తెప్పించడం జరిగినది. ముఖ్యంగా ప్రభుత్వ నిబంధనలు ప్రకారం కలెక్టర్ ఆదేశాల తూచ తప్పకుండా నిబంధనలు పాటించవలెనని తెలియజేశారు, ముఖ్యంగా పరీక్షల కేంద్రంలో కరెంటు, ఫ్యాన్లు, త్రాగునీళ్లు, ప్రథమ చికిత్స వస్తుసామాగ్రి మరియు వీలిళీ ప్యాకెట్స్ ఉండేటట్లు చూసుకోవాలని , ఎగ్జామినేషన్ చీఫ్ సూపరెంట్ లకు చెప్పడం జరిగింది. పదవ తరగతి పరీక్షా కేంద్రాలలో ప్రథమ చికిత్స నిమిత్తం వార్డు హెల్త్ సెక్రటరీస్ తప్పకుండా హాజరు కావాలని సూచించారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో ఎగ్జామినేషన్ చీఫ్ సూపెరెండెంట్ కె.వి శోభన్ బాబు, రంగాదామ్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు. ఆనంద్ ప్రసాద్, జయ ప్రసాద్ హాజరయ్యారు

## సమావేశం ముగియకనే వెళ్లిపోయిన కొంత మంది మండలాధికారులు



సమావేశం ముగియకనే కొంతమంది మండలాధికారులు వెళ్లిపోవడంతో ఖాళీకుర్చీలు దర్శనం ఇస్తున్న దృశ్యం.

**అనంతపురం రూరల్,మార్చి22ప్రభాతవార్త:**

అనంత రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిపి వరలక్ష్మి ఈశ్వరయ్య అధ్యక్షతన ఎంపిడిఓ దివాకర్ మండల సర్వసభ్య సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు,మండల స్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు హజరైయ్యారు.ఈ సమావేశం 11 గంటలకు ప్రారంభించడంతో దాదాపు రెండు గంటల పాటు కొనసాగింది. అయితే సమావేశం కొనసాగుతుండగా సమావేశం ముగియకనే కొంతమంది మండల స్థాయి అధికారులు సమావేశం హల్ నుంచి వెళ్లిపోవడంతో హల్ అన్ని ఖాళీ కుర్చీలు ధర్శనం ఇచ్చాయి. మూడు నెలలకు ఒక్కసారి జరిగే సర్వసభ్య ఈ సమావేశంలో అధికారులు పట్టుమని రెండు గంటలైన కుర్చులేక మధ్యలోనే వెళ్లి పోవడం ఏమిటాన్ని గుసగుసలాడుకోవడం జరిగింది. గ్రామాల్లోని ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని ఏవిధంగా పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో నిర్వహిస్తారు. కాని మండల అధికారులకు మాత్రం ఏదో సమావేశానికి వచ్చామ మా శాఖలో జరిగిన కొన్ని విషయాలను వివరించామ వెళ్లిపోయమ అన్నట్లుగా రావడం,పోవడం జరిగిపోతుంది.ప్రతి సమావేశంలో అనేక సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకవచ్చిన ఆ సమస్యలు పరిష్కరానికి నోచుకోవడంలేదు. మాములుగా అయితే సర్వసభ్య సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభించి సాయంకాలం 4 గంటల వరకు కొనసాగించి అజెండాలోని అంశాలు అన్ని చర్చించాలి. కాని ఇక్కడ మాత్రం కేవలం రెండు గంటలలోనే సమావేశాని ముగించారు.

## ఘనంగా శ్రీఅభయాంజనేయస్వామికి పూజలు

**అమడగూరు, మార్చి 22 ప్రభాతవార్త**



శ్రీఅభయాంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అమడుగూరు మండలంలోని ఏ.కొత్తపల్లి బొబ్బిలికోట గ్రామంలో శనివారం శ్రీకోదండరామలక్ష్మణ సీత ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గణేష్‌స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, తదితర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు పంచామృతం, ప్రసాదాలు పంచిపెట్టారు ఈ కార్యక్రమంలో వార్త రమణ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈ నెల 25న బ్లూమూన్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

**- ఎమ్మెల్యే కందికుంట సహకారంతో హాజరు కానున్న 25 కంపెనీలు**

**- జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోండి: మంచి శివశంకర్**

**కదిరి, మార్చి 22 ప్రభాతవార్త**



శివశంకర్

ఈ నెల 25న ఏపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే కందికుంట సహకారంతో మున్సిపల్ పరిధిలోని బ్లూమూన్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ బేళాను నిర్వహిస్తున్నామని బ్లూమూన్ విద్యా సంస్థల అధినేత మంచి శివశంకర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ తెలిపారు. బ్లూమూన్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంచి శివశంకర్ మాట్లాడుతూ.. నిరుద్యోగుల ఉపాధి కల్పనకై ఈ నెల 25న (మంగళవారం) మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, జాబ్‌మేళాలో సుమారు 25 బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. జాబ్‌మేళాలో హుందాయ్‌మోటార్స్, టాటా ఎలక్ట్రానిక్స్, జెవై సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఫ్లిప్‌కార్డ్, విప్రో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజినీరింగ్ డాక్టర్ రెడ్డీస్, కియామోటార్స్, మూత్తూట్‌ఫైనాన్స్, గ్రీన్‌టెక్, అపోలోఫార్మసీ, అమర్‌రాజా బ్యాటరీస్, కెఎంఎల్, హీరో, మోటోక్రాప్ తదితర కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటాయన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే నిరుద్యోగులు 10వ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమో, బిఫార్మసీ, ఎంఫార్మసీ, నర్సింగ్, ఏదైనా డిగ్రీ, బిటెక్, పిజి చదివిన వారు 18 నుంచి 35 సంవత్సరాల వయస్సగల వారు అర్హులని మెగా జాబ్‌మేళాలో ఎంపికైన వారికి నెలకు రూ.10వేల నుంచి 40 వరకు వేతనం ఉంటుందన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, జెరాక్స్, ఆధార్‌కార్డు, రెండు ఫోటోలు తమవెంట తెచ్చుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9390176421, 9182288465కు సంప్రదించాలన్నారు. జాబ్‌మేళాకు వచ్చిన వారికి కళాశాలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెర్ అధికారి హరికృష్ణ తెలిపారు.

## ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మాల మహానాడు నాయకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాయుడు నాయకులు

**కదిరి, మార్చి 22 ప్రభాతవార్త**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ పేరుతో మాలలకు అన్యాయం జరిగే విధంగా వ్యవహరిస్తున్నారని, మాలమహానాడు నాయకులు శనివారం పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. మాలమహానాడు జిల్లా నాయకులు పిచ్చల రామచంద్ర, పి.శ్రీనాథ్, మధుసూధన్‌రావు ఆధ్వర్యంలో మొదట అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం రిజర్వేషన్ ఫలాలను మాలలకు దక్కకుండా చేయాలని కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ వల్ల మాలల కంటే మాదిగలకే ఎక్కువ నష్టం అని ఈ విషయం ఎమ్మార్పిఎస్ నాయకులకు తెలుసన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీర్మాణం చేయకుండా ఆర్డినెన్స్ జారీ చేసి క్యాబినెట్ ఆమోదించి ఆపై కేంద్ర జాతీయ కమిషన్‌కు పంపాలన్న ఆలోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వంలోని మాల నాయకులు ఎమ్మెల్యేలు బయటికి వచ్చి నిరసన తెలపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో త్యాగరాజు, సూర్యనారాయణ, ప్రసాద్, ఆంజినేయులు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన బాల్య అభివృద్ధి సంరక్షణకై విద్య యొక్క సార్వత్రిక ఏర్పాటు పై శిక్షణ కార్యక్రమం

**నల్లచెరువు మార్చి 22, ప్రభాతవార్త**



శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ తిరుపాల్ నాయక్

నల్ల చెరువు మండల కేంద్రంలోని నల్లచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు శిక్షణ కార్యక్రమం పై రెండవ రోజు శనివారం తూర్పు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ జయంతి ఆధ్వర్యంలో పోసన్ బి పడాయి కార్యక్రమం పైన మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమం ను ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ఎంఈఓ తిరుపాల్ నాయక్ హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నల్లచెరువు, తనకల్లు, గాండ్లపెంట, పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు శిక్షణ తరగతులకు పాల్గొన్నారు ఈ సందర్భంగా సిడిపిఓ జయంతి మాట్లాడుతూ. 0 నుండి 3 సంవత్సరాల పిల్లలకు స్కూలుకు ఆట పాటల ద్వారా ఎలా రప్పించు కోవాలని దివ్యాంగులను ఎలా గుర్తించాలని. విధంగా బెంగళూరు మిక్స్ వాళ్ల సలహాలు సూచనలు ఐసిడిఎస్ సిబ్బందికి ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందని ఈ శిక్షణ కార్యక్రమం మూడు రోజులు పాటు నిర్వహించబడు తుందని, అంగన్వాడి కార్యకర్తలకు శిక్షణ తరగతులకు సంబంధించిన మెటీరియల్ పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్ పద్మావతమ్మ రఫీ ఉన్నిష. జయమ్మ లక్ష్మిదేవి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమానికి హాజరైన అంగన్వాడిలు

## ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత పట్ల హర్షం



పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**ఓబుళదేవరచెరువు, మార్చి 22, ప్రభాతవార్త**

ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించడం పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు లక్ష్మన్న, బావన్న, రమణ, క్రిష్టప్ప, పలక గంగన్న, కత్తి ఆనంద్ లు మాట్లాడుతూ... ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణను కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారున్నారు. మూడు దశాబ్దాల మందకృష్ణ మాదిగ పోరాట స్ఫూర్తికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చి... ఎస్సీ వర్గీకరణ అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించినందుకు రుణపడి ఉంటామని మాదిగల ఆకాంక్షను నెరవేర్చడానికి తన శక్తి వంచన లేకుండా సహాయ సహకారాలు అందించిన కేంద్ర ప్రభుత్వం భారతీయ జనతా పార్టీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా మన్నారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు.

## మందకృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

**అమడగూరు, మార్చి 22 ప్రభాతవార్త**

అమడగూరు మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద శనివారం ఎంఆర్‌పిఎస్ నాయకులు మందకృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నాయకులు మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణమాదిగ 30 సంవత్సరాల పోరాట ఫలితంగా ఎస్‌సి వర్గీకరణకు అసెంబ్లీలో చట్టబద్ధత లభించిందన్నారు. అసెంబ్లీలో ఎస్‌సి వర్గీకరణకు కూటమి ప్రభుత్వం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపి తీర్మానం చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ పలక ఆంజనేయులు, మాదిగ ఉద్యోగుల సంఘం ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు నాగేంద్ర, మండల సీనియర్ నాయకులు ఎనగలూరు లక్ష్మన్న, ఒడిసి ఎం.శ్రీనివాసులు, ఎర్రదొడ్డప్ప వి.కిష్టప్ప వై.లక్ష్మీపతి, సూరి, వంచిరెడ్డిపల్లి రమణ, అమడగూరు మండల ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు యనమల గంగలప్ప, ఉపాధ్యక్షులు పేట సురేష్, మండల ప్రధానకార్యదర్శి దొడ్డప్ప, కార్యదర్శి మద్దె రవి, గౌరవ అధ్యక్షులు టైలర్ సప్పిడి నరసింహులు, గడ్డం నరసింహులు, పూలకుంట చంద్రశేఖర్, వానెల్లు నారాయణ, ఆదినారాయణ, బురుజు రామచంద్ర, చిన్నగానిపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ నవీన్, చిన్నగానిపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు నారాయణ, దూదరగుట్టపల్లి వై.నరసింహులు, వై.వెంకటరమణ, రామాంజనేయులు, తుమ్మల బురుజు రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను కాపాడుకుందాం



మాట్లాడుతున్న తహశీల్దారు దేవేంద్ర నాయక్

**నంబులపూలకుంట, మార్చి 22 ప్రభాతవార్త**

ప్రభుత్వ భూములు రక్షిద్దాం ఎమ్మార్వో దేవేంద్ర నాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రం ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మండల అధికారులతో ఎమ్మార్వో దేవేంద్రనాయక్ సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రం పరిధిలో ప్రభుత్వ భూములు, ఇరిగేషన్ భూములు, అటవి శాఖ భూములు, అక్రమానికి గురైన భూములు గుర్తించి ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములు కాపాడుకోవడమే ముఖ్య ఉద్దేశం ఈ ప్రభుత్వ భూములు కాపాడుకుంటే భవిష్యత్ అవసరాలకు ఉపయోగకరంగా ఉంటుంది .అందుకుగాను మండల స్థాయి అధికారులందరూ ఉమ్మడిగా త్వరలో పర్యవేక్షణ చేపడతామని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సై వలి బాషా, ఇఒఆర్‌డి మాధవ రెడ్డి, ఇరిగేషన్ అధికారి మహేష్, సర్వేర్లు, వీఆర్వోలు రైతులు పాల్గొన్నారు.

## బెట్టింగ్, జూదాలకు దూరంగా ఉండండి

**తనకల్లు, మార్చి 22 ప్రభాతవార్త**



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, గ్రామ ప్రజలు

బెట్టింగ్, జూదాలకు దూరంగా ఉండాలని, తమ ప్రాణాలను కాపాడుకోవాలని ఎస్సై గోపి పేర్కొన్నారు. శనివారం తనకల్లు మండల పరిధిలోని కొక్కంటిక్రాస్ నుండి తనకల్లు పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్సై గోపి మాట్లాడుతూ బెట్టింగ్ భూతం వలన అనేక మంది యువత తమ ప్రాణాలను పోగొట్టుకుని తమ కుటుంబానికి తీరని శోకం మిగులుస్తున్నారన్నారు. తయచేసి యువత బెట్టింగ్, ఆన్లైన్ జూదం తదితర వాటికి దూరంగా ఉండి తమ తల్లిదండ్రుల దుఖానికి కారణం కాకూడదని , ప్రతి ఒక్కరు వాటికి దూరంగా ఉండాలని, యువతలో చైతన్యం తీఉకురావడానికి కొక్కంటి క్రాస్ నుండి తనకల్లు పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ర్యాలీలో ఎస్సై గోపితోపాటు జమీదార్ సుబ్బయ్య, వెంకటేష్, జనసేన పార్టీ ఎంపిటిసి అమర్ కార్తికేయ, మండల తెలుగు యువత అధ్యక్షుడు కావాడి ప్రవీణ్‌కుమార్, చైతన్య స్కూల్ తలమర్ల పవన్‌కుమార్, సోంపాలెం అనిల్, అశోక్, కెవి.రమణ, ఫయాజ్, షోకీర్, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అకాల వర్షాలకు నేలకొరిగిన మొక్కజొన్న పంట



◄ నేలకొరిగిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు

**తనకల్లు, మార్చి 22 ప్రభాతవార్త:**

తనకల్లు మండల కేంద్రంలోని తారకారామ నగర్‌కు చెందిన ఎగవిండ్ల ఆంజినేయులు అనే రైతు మొక్కజొన్న పంటను సాగు చేశాడు. అయితే పంట చేతికొచ్చే సమయానికి అకాల వర్షంతో గాలివాన సృష్టించిన భీభత్సంతో పంట మొత్తం నేల కొరిగిందని, మండల వ్యవసాయ అధికారులు తక్షణం స్పందించి పంటను పరిశీలించి నష్టపరిహారం అందించాలని ఆయన కోరారు.

## ఈకెవైసి చేయించుకోండి..

**గార్లదిన్నె మార్చి 22 ప్రభాతవార్త**

గార్లదిన్నె రేషన్‌కార్డుదారులకు తహశీల్దారు విజ్ఞప్తి చేశారు..రేషన్ కార్డులోని కొంత మంది సభ్యులందరూ ఈ నెల 31వ తేది లోపు ఈకెవైసి చేయించుకోవాలని అనంతపురము సంయుక్త కలెక్టర్ వారు సూచించారు. రైస్ కార్డ్స్ కు సంబంధించి గార్లదిన్నె మండలంలో 6528 మంది సభ్యులు ఇప్పటికీ ఈకెవైసి చేయించుకోలేదని ఈకెవైసి చేయించుకున్న వారికి మాత్రమే ఏప్రిల్ లో నిత్యావసర సరుకులు అందుతాయన్నారు.ఈకెవైసి చేయించుకోని వారి జాబితా సంబంధిత గ్రామ చౌకధరల దుకాణపు డీలరు, సచివాలయ గ్రామ రెవెన్యూ అధికారి, సిఎస్‌డిటి వద్ద ఉంటుందన్నారు. వారిని సంప్రదించి, సంబంధిత గ్రామ చౌక ధాన్యపు దుకాణపు డీలరు వద్ద గల ఈపాస్ యంత్రంలో వేలిముద్ర ద్వారా మరియు గ్రామా సచివాలయ మొబైల్ యాప్ నందు ఈకెవైసి నమోదు తప్పకుండా చేసుకోవాలని గార్లదిన్నె ఎమ్మార్వో ఈరమ్మ తెలిపారు.

## కేజీబీవీలో సీట్లుకై దరఖాస్తు చేసుకోండి

**నల్లచెరువు మార్చి 22 ప్రభాత వార్త**

నల్లచెరువు కేజీబీవీ పాఠశాల యందు 6 మరియు 11వ తరగతి ప్రవేశాలకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కస్తూరిబా గాంధీ స్కూల్ ఎస్ ఓ శిరీష శనివారం పత్రిక ప్రకటన తెలిపారు ఈ సందర్భంగా ఎస్ ఓ మాట్లాడుతూ. అడ్మిషన్స్ 2025-26 సంవత్సరముకు గాను 6వ తరగతి కి 40 సీట్లు, ఎంపీసీ ఫస్ట్ ఇయర్ నందు 40, సీట్లు మాత్రమే ఉన్నాయని, అభ్యర్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రం ఎంపికైన విద్యార్థులకు వారికి ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు.

06ATP27_06ATP27.qxd 22-03-2025 PM 10:50 Page 1



## అమ్మాయిలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవు

- శ్రీ సత్యసాయిజిల్లాను బాలల స్నేహ జిల్లాగా ఏర్పాటుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి - బాల్య వివాహాలకు దూరంగా ఉండండి, చదువుకు ప్రాధాన్యత ఇవ్వండి - న్యాయ విజ్ఞాన సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి గీతావాణి

చెన్నేకొత్తపల్లి, మార్చి, 22(ప్రభాతవార్త



న్యాయ విజ్ఞాన, సదస్సులో మాట్లాడుతున్న, సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి

మండల, పరిధిలోని, ఎర్రోనపల్లి గ్రామంలో ఆర్.డి.టి ఆధ్వర్యంలో హై కోర్టు ఆదేశాల మేరకు ధర్మవరం మండలం లీగల్ సర్వీస్ అథారిటీ వారు, శనివారం,న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమాన్ని, నిర్వహించారు,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ జర్జి శ్రీమతి గీతావాణి, ఆర్ డిటి రిజినల్ డైరెక్టర్ శ్రీమతి ప్రమీల కుమారి, జునియర్ సివిల్ జర్జి పి.వి.హరీష్, రామగిరి సిఐ శ్రీధర్, హాజరయ్యారు, ఈ సందర్భంగా సీని యర్ సివిల్ జర్జి శ్రీమతి గీతావాణి, మాట్లాడుతూ బాలలను కాపాడవలసిన భాద్యత ప్రతి ఒక్కరిది అలాగే బాలలు కుడా తమ హక్కులను, భాధ్యతలను తెలుసుకొని నేటి బాలలే రేపటి పౌరులు అన్నట్టుగా భవిషత్తులో ప్రతి ఒక్కరు అత్యన్నత స్థాయికి ఎదగాలని తెలియజేశారు,చేన్నేకొత్తపల్లి మండలా న్ని బాలల సమస్యలు లేని మండలముగా తయారు చేయడానికి ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని కోరుతూ అమ్మాయిలు అవకాశాలను అందిపు చ్చుకోవాలని అలాగే ప్రస్తుతసమాజంలో ఎదురైయ్యే సమస్యలపట్ల అవగాహ న కలిగి ఉండాలన్నారు, జిల్లా అలాగే మండల న్యాయ సేవా అధికార సంస్థలు ప్రతినెల గ్రామ స్థాయిలో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఉచిత న్యాయ సేవలు గురించి తెలియజేస్తుంధన్నారు. ప్రస్తుత సమాజంలో అమ్మాయిలు లైంగిక వేధింపులకు గురిఅవుతున్నారు కాని తక్కువగా రిపోర్ట్ అవుతున్నాయి అలా కాకుండా ధైర్యంగా ముందుకొచ్చి పిర్యాదు చేస్తే శివిదిళివి చట్టం 2012 ప్రకారం నేర తీవ్రతను బట్టి శిక్షలు ఉంటాయని అదేవిధంగా భాధితులకు ఉచితంగా న్యాయవాదిని ప్రభుత్వం ఏర్పాటుచేస్తుందని అంతే కాకుండా నేరారోపణ ఎదుర్కొంటున్న వారికి కుడా ఉచిత న్యాయ సేవలు అందిస్తుందని ఇలాంటి ఉచిత సేవలు పొందాలంటే ఒక సంవత్సరానికి మూడు లక్షల లోపు ఆదాయం ఉండాలని అన్నారు.ఆర్ డి టి రిజినల్ డైరెక్టర్ శ్రీమతి ప్రమీల కుమారి, మాట్లాడుతూ, ఆర్ డి టి సంస్థ బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వ శాఖలతో కలసి ముందస్తు చర్యగా అన్ని ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలని ఏర్పాటు చేసి పిల్లలకు అలాగే తల్లిదండ్రులకు ప్రస్తుత సమాజంలో పిల్లలకున్న సమస్యల పట్ల అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బాలత్రిపుర సుందరి, చరణ్, హేమంత్, ఆర్ డి టి మహిళా అభివృద్ధి విభాగం టీం లీడర్ ఆదినారాయణ, ఆర్ డి టి ఏరియా టీం లీడర్ శ్రీనివాసులు,ఆర్డిటిసిబ్బంది శారద,మురళి,గీతావాణి, ప్రధానోపాధ్యాయు లు మంజులా వాణి, గ్రామ ప్రజలు, చిన్నారులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 4న నూతన మండల యాదవకుల సంఘం కమిటీ ఎన్నిక



కుల సంఘం ఏర్పాటు కోసం యాదవులు సమావేశమైన దృశ్యం

సోమందేపల్లి మార్చి 22 ప్రభాతవార్త

రాజకీయంగా, ఆర్థికంగా,విద్యాపరంగా అన్ని రకాలుగా వెనుకబడిన యాదవ కులస్తుల ఐక్యత కోసం, కుల అభివృద్ధి కోసం ఏప్రిల్ 4 న నూతన మండల యాదవ సంఘం కమిటీ ఎన్నికలు ఉంటాయని యాదవ్ సంగం నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక పాత ఊరిలోని కాల్ అమ్మ కాలమ్మ గుడి వద్ద యాదవ కులస్తులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2008న వేణు మాధవ యాదవ వెల్ఫేర్ సొసైటీ సంగం నామకరణంతో సంఘం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే గతంలో చేర్పులు మార్పులతో కమిటీ ముందుకు సాగుతూగత రెండు సంవత్సరాల కాల పరిమితికి కమిటీ ఎన్నుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆ కమిటీని రద్దు పరచుకుంటూ నూతన కమిటీ ఎన్నికకు చర్చలు జరిపినట్లు తెలిపారు.ఏప్రిల్ 4న నూతన వేణుమాధవ్ వెల్ఫేర్ సొసైటీ సంఘం ఎన్నిక జరుగుతుందని యాదవ సంఘం నాయకులు తెలియజేశారు.ఈ సమావేశానికి మండలంలోని ప్రతి ఒక్క యాదవ కులస్తుడు హాజరుకావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు జి మహేష్ యాదవ్, జిపి నరసింహ యాదవ్, శివశంకర్ యాదవ్, హరికృష్ణ యాదవ్, ఏజీ నరసింహులు యాదవ్ ,శ్రీనివాస్ యాదవ్, ఉపేంద్ర యాదవ్, రమేష్ యాదవ్, నాగరాజ్ యాదవ్, రాజగోపాల్ యాదవ్, గోపాల్ యాదవ్, మైళారి యాదవ్, ఈశ్వరప్ప యాదవ్, అంజి యాదవ్, ఓబులేష్ యాదవ్, మురళి యాదవ్ ,ఈశ్వరప్ప యాదవ్, భద్రి యాదవ్, నరేష్ కుమార్ యాదవ్, గోపాల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు

## కస్తూర్బా గాంధీ, పాఠశాలలో ప్రవేశాలకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోండి

చెన్నేకొత్తపల్లి,మార్చి 22( ప్రభాతవార్త



మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 202526 విద్యా సంవత్సరానికి 6,11 తరగతుల ల్లో ప్రవేశాల కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్, సువర్ణ, శనివారం,ఒక ప్రకటనలో తెలియజే శారు. ఈ సందర్భంగా, ఈ నెల 22వ తేదీ నుంచి కస్తూర్బా గాంధీ పాఠశాల లో ప్రవేశాల కోసం బాలికల నుంచి ఆన్లైన్లో దరఖాస్తులు, ఏప్రిల్ 11 వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 7, 8, 9, తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆన్లైన్లోనే దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు, 11వ తరగతికి మాత్రం, ఈ పాఠశాల యందు లీ శి ది, గ్రూప్ మాత్రమే కలదు, అనాథలు,బడి బయట పిల్లలు,డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టి బిపిఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు,ఆన్లైన్లో వచ్చిన దరఖాస్తులు మాత్రమే, పరిగణింప బడతాయన్నారు, ఈ దరఖాస్తు, https://apkgbv apcfss. in/ సైట్ద్వారా పొందగలరని అన్నారు,ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మేసేజ్ ద్వారా సమాచారం అందుతుందన్నారు. సంబంధిత పాఠశాల నోటిఫికేషన్ బోర్డులో, నేరుగా చూడవచ్చని ప్రిన్సిపాల్, తెలియజేశారు, వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్, 18004258599ను సంప్రదించగలరని సూచించారు.

## కోరం లేక వాయిదా పడ్డ సర్వ సభ్య సమావేశం

### ఒకే ఒక్క సభ్యుడు సభకు హాజరు

గుమ్మఘట్ట మార్చి 22 ప్రభాతవార్త

మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం జరగాల్సిన సర్వ సభ్య సమావేశం వాయిదా వేసినట్లుగా ఎంపిడిఓ బి రామకృష్ణ పేర్కొన్నారు కోరం లేక సాధారణ మండల సర్వ సభ్య సమావేశం వాయిదా పడింది వీరాపురం సర్పంచ్ ఒకే ఒక్క సభ్యుడు హాజరు కావడం కావడం విశేషం అధికారులు కూడా 12 గంటలు వరకు వస్తూండటం గమనార్హం.

## చిన్నారులకు చక్కటి బోధన అందించండి

ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి,



అంగన్వాడీ హెల్పర్లకు నియామకపత్రాలు అందజేసిన ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్ మార్చి 22 ప్రభాతవార్త,

అంగన్వాడి సెంటర్లలో చిన్నారులకు చక్కటి బోధన అందించాలని ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మడకశిర నియోజకవర్గంలోని పలు అంగన్వాడీ సెంటర్లలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ సహాయకురాళ్ల ఆరుగురికి నూతనంగా నియామక పత్రాలను ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు అందజేశారు. శనివారం పట్టణంలోని ఆర్అండ్బి విశ్రాంతి భవనంలో ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు మాట్లాడుతూ: చిన్నారుల యోగక్షేమాలు చూసే బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని, భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దడం అంగన్వాడీలతోనే ప్రారంభమవుతుందని గుర్తు చేశారు. విధి నిర్వహణలో ఎక్కడా అలసత్వం వహించవద్దని తెలిపారు. తదనంతరం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ సమీపంలో ఉన్న స్త్రీ, శిశుసంక్షేమ భవనాన్ని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో అక్కడ భోజనం చేస్తున్న అంగన్వాడీ కార్యక ర్తలతో కలిసి నేలపై కూర్చుని భోజనం చేశారు. అంగన్వాడీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్య వచ్చినా మీకు నేనున్నానంటూ తన ఫోన్ నంబర్ ఇచ్చి వారిలో మనోధైర్యాన్ని నింపారు. ఆహార నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, సిడిపిఓ నాగమల్లేశ్వరి,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు,

## నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో CCTV Installation కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

బుక్కపట్నం మార్చ్ 22 ప్రభావతవార్త

ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సీడ్ యాప్ సంయుక్తంగా CCTV Installation కోర్సులు ప్రారంభిస్తున్నట్లు శీళీళీ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల బుక్కపట్నం స్కిల్ హబ్ లో ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ మక్బుల్ హుస్సేన్ గారు మరియు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరి కృష్ణ ఒక ప్రకటనద్వారా తెలియజేశారు. ITI ఇంటర్ ,డిగ్రీ ,పాస్ లేదా ఫెయిల్ ఆపైన చదివిన వారు ఈ కోర్సులను నేర్చుకోవడానికి అర్హులు. ఆసక్తి ఉన్న యువతి యువకులు తమ ఆధార్ లింక్ కలిగినా మొబైల్ నెంబర్ కలిగి ఉండాలి. కోర్సు వేవధి 3నెలలు ఉంటుందని శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కూడా కలగజేస్తామన్నారు. ఆసక్తి కలవారు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ ను 7981541994సంప్రదించాలని కోరారు.

## పొలాల్లో గుర్తుతెలియని మహిళ శవం లభ్యం

ధర్మవరం రూరల్ మార్చి 22 ప్రభాతవార్త



మృతురాలి శవాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మండల పరిధిలోని రేగాటిపల్లి గ్రామ శివార్లలో కేతిరెడ్డికాలనీకి వెళ్లే దారిలో రేగాటి పల్లి గ్రామానికిచెందిన తిమ్మన్నగారి నాగిరెడ్డి వ్యవసాయ బీడు పొలంలో శనివారం గుర్తు తెలియని మహిళాశవం లభ్యమైంది. ధర్మవ రం రూరల్ పోలీసులకు అందిన సమాచా రం మేరకు ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించ గా 35 నుండి 40 సంవత్సరాలు మధ్యగల మహిళా శవం గుర్తుపట్టలేని స్థితిలో పడి ఉన్నదని రూరల్ ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. మృతురాలు గుండు కొట్టించుకుం దని శరీరంపై చిలుక పచ్చ రంగులో లవ్ సింబల్ కలిగిన పాచి రంగు చీర పాచి కలర్ జాకెట్ పింక్ కలర్ లంగా తో చీర కొంగుకు తాళం చెవులు ముడి వేయబడి ఉన్నదని మెడలో నల్లపూసల దండ ఒక జత పింక్ కలర్ చెప్పులు మృతురాలు ఆనవాలుగా గుర్తించడం జరిగిందని వీటి ఆధారంగా మృతురాలి వివరాలు గుర్తుపట్టిన వారు దిగువ తెలుపబడిన ఫోన్ నెంబర్లకు ఎస్ఐ, 9440796834,సిఐ, 9440796832, సంప్రదించాలని కోరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు రూరల్ ఎస్.ఐ శ్రీనివాసులు తెలిపారు.

## జల దినోత్సవం సందర్భంగా ఉపాధి పనులు ప్రారంభం

అమరాపురం మార్చి 22 ప్రభాతవార్త



పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

మండలంలో వలస ,అగ్రహారం గ్రామాలలో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శనివారం జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద ఫారం పండ్లను ఏర్పాటు కోసం పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి మండలకన్వీనర్ గణేష్,ఏపీఓ జగదీష్, టెక్నికల్ అసిస్టెంట్ హనుమంతరాయ, సర్పంచ్ ధనుంజయ, మాజీసర్పంచ్ చంద్రశే ఖర్ గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్లు వలస దేవరాజు, అగ్రహారం వెంకటేష్, చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, నాగరాజు, రామ్మూర్తి తదితరు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ రైతులు పారంపం డ్లను నిర్మాణం చేసుకొని వర్షపు నీరు ఇంకిపోయి భూగర్భ జలమట్టం వృద్ధి చెందడానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. టిడిపి మండల కన్వీనర్మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధిహామీ పథకంద్వారాభూగర్భ జలమ ట్టం పెంచడానికి కృషిచేస్తున్నట్లు ఈఅవకాశాన్ని చేసుకోవాలని కోరారు.

## నాటు సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం



నవోదయం పోస్టర్లు విడుదల చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

పెనుకొండ మార్చి 22 ప్రభాతవార్త

జిల్లాలో ప్రతి గ్రామాన్ని నాటు సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు నడుం కట్టాలని పెనుకొండ ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ సృజన బాబు కోరారు. శనివారం నియోజకవర్గం పరిధిలోని గోరంట్ల మండలం,గడ్డం తండా నందు నవోద్నయ 2.0(నాటు సారా నిర్మూలన కార్యక్రమం లో ఆయన మాట్లాడారు. శ్రీసత్య సాయి జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీ గోవిందనాయక్ ఆధ్వర్యం లో అవగాహన సదస్సు నిర్వహించి ,నాటు సారా ప్రభావాల గురించి వివరించి, సారా తయారుచేసే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని,అలాగే నవోద్నయ 2.0 ను విజయవంతం చేయాలని ఆయనవిజ్ఞప్తి చేశారు. కార్యక్రమం లో పుట్టపర్తి ఇన్స్పెక్టర్ జి నాగరాజు ,పెనుకొండ స్టేషన్ ఎస్సైలు రాజశేఖర్, రాముడు, గ్రామ సర్పంచ్ వాసు నాయక్,,గ్రామ పెద్దలు శ్రీరాం నాయక్, పీక్ల నాయక్, గోవింద్ నాయక్, వెంకటేశులు నాయక్, రూప్లే నాయక్ , గ్రామ ప్రజల పాల్గొన్నారు.

## వైభవంగా లక్ష్మినరసింహుని ప్రాకారోత్సవం

- స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించిన భక్తులు

ఉరవకొండ, మార్చి 22 ప్రభాతవార్త



శ్రీవారి ప్రాకారోత్సవం జరుగుతున్న దృశ్యం

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం పెన్నహోబి ళంలో వెలసిన లక్ష్మినరసింహస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్స రం పాల్గుణ అష్టమి శనివారం సాయం త్రం లక్ష్మినరసిం హుని పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్బాబు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీర్చిగా ప్రధా నాలయంచుట్టూ ప్రదీక్షిణ నిర్వహించారు. జిల్లానలుమూలలనుండే కాకుండా కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హరిజన హాస్టల్ స్థలం అక్రమ రిజిస్ట్రేషన్పై చర్యలు తీసుకోవాలి

- మండల తహశీల్దార్ కార్యాలయం ముందు పట్టణ దళితుల ధర్నా
- కమిటీ పేరుతో స్థలం కాజేయాలనే యత్నం జరుగుతోందని విమర్శ

ఉరవకొండ, మార్చి 22 ప్రభాతవార్త



తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న ఉరవకొండ పట్టణానికి చెందిన దళితులు



రెవెన్యూ ఇన్స్పెక్టర్ టి.రామకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ పట్టణంలోని పోలీస్ స్టేషన్ పక్కనగల గాంధీ హరిజన హాస్టల్కు చెందిన విలువైన స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన, చేయించుకున్న వారిపై తగిన చర్యలు తీసుకొని స్థలం మాదిగ కులాల అభివృద్ధికి ఉపయోగ పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకో వాలని ఉరవకొండ పట్టణానికి చెందిన దళితులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని దళితులు స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయంకు ప్రదర్శ నగా చేరుకొని ప్రధాన ద్వారం ముందు బైటాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాకు నాయకత్వం వహించిన ఎం.బసవరాజు, కె.ఎర్రిస్వామి, ఎం.రాజు, ఎం.వరప్రసాద్, ఎం.పెద్దన్న, మీనుగ రమేష్, ఎం.కె.మల్లికార్జున తదితరులు మాట్లాడుతూ ఉరవకొండ పట్టణంలో దాదాపు 2వేల దళిత కుటుంబాలు ఉన్నాయని అందులో అనేకమంది గాంధీ హరిజన హాస్టల్లో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకున్నారన్నారు. సర్వే నంబర్ 533/బి1, 533/సిలో 2.67 ఎకరాల హాస్టల్ స్థలంలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. కొందరు స్వార్థపరులు స్థలాన్ని కాజేయాలన్న దురుద్దేశంతో ఎస్సీల్లోని స్థానికులకు, స్థానికేతరులకు మధ్య గొడవలు జరిగేలా వ్యవరిస్తున్నారని వాపోయారు. గాంధీ హరిజన హాస్టల్ స్థలంపై సమగ్ర విచారణ చేసి స్థలాన్ని అక్రమ రిజి స్ట్రేషన్లు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టల్ స్థలం విషయమై స్థానికేతరులు కొంద మంది స్థానికుల మధ్య గొడవలు జరిగే విధంగా పత్రికా స్టేట్మెంట్లు ఇస్తున్నారన్నారు. గాంధీ హరిజన హాస్టల్ కమిటీ పేరుతో స్థలాన్ని కబ్జా చేయాలని కొంత మంది దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గాంధీ హరిజన హాస్టల్ స్థలంలో ఎస్సీ (మాదిగ) కాంప్లెక్స్, మాదిగ కమ్యూనిటీ హాల్ నిర్మించేందు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నా అనంతరం వినతిపత్రాన్ని రెవెన్యూ ఇన్స్పెక్టర్ టి.రామకృష్ణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన వందలాది మంది దళితులు పాల్గొన్నారు.

## బిజెపి బలోపేతానికి కృషి చేద్దాం

- బిజెపి మండల కన్వీనర్ దేవర రామ్మోహన్

తాడిమర్రి మార్చి 22 (ప్రభాతవార్త)



బిజెపి మండల కన్వీనర్ దేవర రాము

మండలంలో బిజెపిని సంస్థగతంగా బలోపేతం చేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా చేసుకుని సైనికుల్లా పోరాడుదామని బిజెపి మండల కన్వీనర్ దేవర రామ్మోహన్ నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ సంఘటన మంత్రి మధుకర్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశాల ప్రకారం మండల నాయకులు కార్యకర్తలు కలసికట్టుగా బిజెపిని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు నడుం బిగించి సైనికుల్లా పోరాడాలని అన్నారు. అలాగే రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మంజూరు చేసే నిధుల గురించి ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని అన్నారు. మండలంలో ఇప్పటికే 6 వేల మందికి పైగా సభ్యత్వాలు స్వీకరించారని ఆ సంఖ్యను పదివేల వరకు తీసుకువెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. త్వరలో పూర్తిస్థాయిలో మండల కమిటీలను ఏర్పాటు చేసేందుకు బిజెపి అధిష్టానం నిర్ణయం తీసుకుందని సమర్థవంతమైన నాయకులను కమిటీలలోకి తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

## ఫారం పాండ్ల నిర్మాణానికి భూమి పూజ

అగళి, మార్చి 22 ప్రభాతవార్త



భూమిపూజ చేస్తున్న జడ్పిటిసి

మండల పరిధిలోని కదిరేపల్లి గొల్లహట్టి సమీపంలో నూతనంగా ఫారం పాండ్ల నిర్మాణానికి జడ్పిటిసి ఉమేష్, కన్వీనర్ కుమారస్వామి భూమిపూజ చేశారు. ఉపాధికూలీలు, ఫారం పాండ్లు తవ్వుకుంటే వర్షాకాలంలో భాగా వర్షాలు వచ్చి నీరు నిలవ వుంటుందని, భూగర్భ జలాలు పెరుగుతాయని, అందుకోసం ప్రభుత్వం విరివిగా ఫారం పాండ్ల నిర్మాణం చేపట్టినట్లు జడ్పిటిసి, కన్వీనర్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్, క్లస్టర్ ఇన్చార్జ్ శివకుమార్, సర్పంచు రామన్న, తిప్పేస్వామి, రమేష్, చిక్కప్పయ్య, రంగనాథ్, గురుమూర్తి తదితరులు ఉన్నారు.

## పాలసముద్రం క్రాస్లో జనసైనికుల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

-గోరంట్ల సిఐ బోయ శేఖర్ చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభం

గోరంట్ల, మార్చి 22 ప్రభాతవార్త



సిఐని సన్మానిస్తున్న నాయకులు

ప్రస్తుతం వేసవిని దృష్టిలో వుంచుకుని ప్రజల దాహార్తి తీర్చాలన్న లక్ష్యంగా గోరంట్ల మండలం లోని నేషనల్ హైవే పాలసముద్రం క్రాస్లో శనివారం జనసేన పార్టీ ఆధ్వ ర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి గోరంట్ల సిఐ బోయ శేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కత్తిరించి చలివేంద్రాన్ని ప్రారంభించారు. పాలసముద్రం, వడిగేపల్లి పంచాయతీ పరిధిలోని జనసేన పార్టీ నాయకులు దేవులచెరువు రమేష్, గొల్లపల్లి శివ, మంజునాథ్, పాలసముద్రం మహేష్రెడ్డి, తదితరుల ఆధ్వర్యంలో వారి ఆర్థిక సహాయంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాలకు జనసేన మండల అధ్యక్షులు సంతోష్ కుమార్, జిల్లా కార్యదర్శి సురేష్, జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేష్, జిల్లా కార్యక్రమాల కమిటీ మెంబర్ పాగుతోట వెంకటేష్, నియోజకవర్గ నాయకులు అనిల్కుమార్యాదవ్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఐ శేఖర్ మాట్లాడుతూ సమాజ సేవా కార్యక్రమాల్లో జనసేన పార్టీ నాయకులు పాల్గొనడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం జనసేన నాయకులు సిఐ బోయ శేఖర్ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చౌడేశ్వరికాలనీ శ్రీనివాసులు, రమేష్, నాగభూషణ, టిడిపి నాయకులు మనోహర్, మూర్తి, గంగాధర్, బాబా, చైతు, శంకర్, సుధా, రాజు, గోపి, హర్ష, గిరి, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## నీటి సంరక్షణకు ప్రాధాన్యత

-ఎంపిడిఓ ప్రభాకర్నాయక్

గుత్తి, మార్చి 22 ప్రభాతవార్త



భూమిపూజ చేస్తున్న దృశ్యం

మండు వేసవి దృష్ట్యా ప్రతి ఒక్కరూ నీటిని నిల్వ వుంచేందుకు కృషి చేయాలని ఎంపిడిఓ ప్రభాకర్నాయక్ సూచించారు. నీటి సంరక్షణ దినోత్సవం పురస్కరించుకొని శనివారం ఆయన మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో ఫారం ఫాండ్ నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. ఎండల్ని దృష్టిలో వుంచుకొని ఉపాధి కూలీలు త్వరగా పనికి వచ్చి పనులు ముగించుకొని వెళ్లాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ మద్దిలేటి ఈశ్వర్రెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## కస్తూరిబా బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

గుత్తి, మార్చి 22 ప్రభాతవార్త



ప్రిన్సిపాల్ మాట్లాడుతున్న దృశ్యం

గుత్తి పట్టణంలోని కస్తూరిబా బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయం ప్రిన్సిపాల్ రుద్రాక్షి తెలిపారు. 6వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపిహెచ్డబ్ల్యు (ఎఫ్) ఒకేషనల్ కోర్సులో చేరడానికి అర్హులైన విద్యార్థులు ఏప్రిల్ 11వతేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్లో 40 సీట్లు వున్నాయన్నారు. అనాధ పిల్లలు బడి బయట, పేద తరగతి ఎస్సి, ఎసి, బిసి, మైనార్టీ విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

## కొడుకు సమాధి వద్ద తల్లి ఆత్మహత్యాయత్నం

### -చికిత్స పొందుతూ మృతి

గోరంట్ల, మార్చి 22 ప్రభాతవార్త



మృతి చెందిన సాకమ్మ (ఫైల్ఫోటో)

కన్నకొడుకు మరణవార్తను జీర్ణించుకోలేక కొడుకు మృతి చెందిన 30 రోజుల్లోనే తల్లి సైతం బలవంతంగా కొడుకు సమాధి వద్దే యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృత్యువాత పడిన సంఘటన కంట కన్నీరు తెప్పిస్తోంది. ఈ సంఘటన గోరంట్ల పట్టణంలో చోటు చేసుకుంది. గోరంట్లకు చెందిన సాకమ్మ (60) ఈ నెల 10వతేదీన ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ శనివారం కర్నూల్ ఆసుపత్రిలో మృతి చెందింది. గత నెల 10వతేదీన సాకమ్మ రెండవ కుమారుడు శ్రీనివాసులు అనారోగ్యానికి గురై మనస్థాపం చెంది తన నివాసంలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనను జీర్ణించుకోలేక తల్లి సాకమ్మ నెలరోజులపాటు తీవ్ర మనోవేదనకు గురై సరిగ్గా 30వ రోజు నాడు గ్రామ చివర వున్న కొడుకు సమాధి వద్దకు వెళ్లి వెంట తెచ్చుకున్న యాసిడ్ను తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఆమెకు మెరుగైన వైద్యం కోసంనకుటుంబసభ్యులు బెంగుళూరుకు తరలించారు. అక్కడి నుండి కర్నూల్కు తరలించి చికిత్స నిర్వహిస్తుండగా శనివారం మృత్యువాత పడినట్లు తెలిపారు.

## ఫోక్సో చట్టం గురించి విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి అశోక్కుమార్

మడకశిర మార్చి 22 ప్రభాతవార్త;

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శనివారం జడ్జి ఆర్.అశోక్కుమార్ ఫోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. భారత ప్రభుత్వం 2012లో లైంగిక నేరాల నుండి పిల్లలను రక్షించేందుకు తీసుకొచ్చిన ఫోక్సో చట్టం గురించి తెలియజేశారు. ఆడ పిల్లలను లైంగిక వేధింపుల నుండి రక్షించడం, లైంగిక వేధింపులకు పాల్పడిన వారికి ఎటువంటి కఠినమైన శిక్షలు పడతాయో వాటి గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, నాగరాజు, సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజ్కుమార్, లాయర్లు వైసి.గోవర్ధన్రెడ్డి, డి,గోవిందప్ప, వి.నాగరాజులు పాల్గొన్నారు.

09ATP27_09ATP27.qxd 22-03-2025 PM 10:52 Page 1



## చందకచర్ల వాసి శ్రీశైలం దేవస్థానం విశ్రాంత ఉద్యోగి సదానందం మృతి



సదానందం మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ

మడకశిర మార్చి 22 ప్రభాతవార్త:

చందకచర్ల గ్రామానికి చెందిన శ్రీశైలం దేవస్థానం విశ్రాంత ఏఈఓ సదానందం శుక్రవారం అనారోగ్యంతో కర్నూలు ఆసుపత్రిలో మరణించారు. విషయం తెలుసుకొన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మడకశిర నియోజకవర్గం ఇంఛార్జ్ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి శనివారం మృతుడు సదానందం స్వగ్రామమైన చందకచర్లలో ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆంజనేయులు, కౌన్సిలర్ ఉమాశంకర్, తెలుగు యువత అధ్యక్షులు తిమ్మరాజు, తేదేపా నాయకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వీరశైవ రుద్రభూమిలో బోరు, నీటి ట్యాంకు ఏర్పాటుకు భూమిపూజ

- ముఖ్య అతిథిగా హాజరైన గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి



వీరశైవ రుద్రభూమిలో బోరు, ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి

ఉరవకొండ, మార్చి 22 ప్రభాతవార్త

పట్టణంలోని వీరశైవ రుద్రభూమిలో (స్మశానం) రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాలతో బోరు వేయించి సిస్టం ట్యాంకు నిర్మించి మోటారు ఏర్పాటు చేసే పనులకు వీరశైవ సమాజం శ్రీకారం చుట్టింది.



ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామినుు పూలమాలతో సన్మానిస్తున్న దృశ్యం

కార్యక్రమానికి గవిమఠ సంస్థాన ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి ముఖ్య అతిథిగా హాజరై వీరశైవ సమాజం బాధ్యులతో కలిసి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఎన్నో సంవత్సరాలుగా కనీస అభివృద్ధికి నోచుకోని వీరశైవ రుద్రభూమిలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి సహకరించి మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులుకు వీరశైవ సమాజం తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం నాయకులు పాటిల్ నిరంజన్‌గౌడ్, ఆమిద్యాల యోగేష్, దేశాయి వీరేష్, మోపిడి చంద్రమౌళి, నీలకంఠ, బసవరాజు, డిష్ మల్లికార్జున, పాటిల్ రాంమోహన్, నింబగల్లు కిషోర్, పంచాయతీ వార్డు సభ్యులు ఎం.రామాంజినేయులు, చేజాల ప్రభ్యాకర్, స్థానికులు ఆకుకూర నాగరాజు, కాంట్రాక్టర్ ముష్టూరు బాషా తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తీర్చిన పందిపర్తి సర్పంచ్

- వేసవిలో నీళ్ల సమస్య రాకూడదని ముందస్తు చర్యలు- మంచేపల్లికి పైపులైను





పైప్ లైన్ పనులు జరుగుతున్న దృశ్యం, మంచేపల్లికి పైప్ లైన్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

సోమందేపల్లి మార్చి 22 ప్రభాతవార్త

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మంచేపల్లి వాసుల తాగునీటి సమస్య తీర్చడానికి పందిపర్తి సర్పంచ్ ఎర్రమ్మ నడుం బిగించారు. రానున్న వేసవి ని దృష్టిలో పెట్టుకుని,నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. సర్పంచ్ గా ఎన్నికైనప్పటినుండి గ్రామ అభివృద్ధి కోసం పలు పనులకు శ్రీకారం చుట్టారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు రాకుండా,ప్రజలు రోగాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు పంచాయితీ పరిధిలో శానిటేషన్ చేయించి,బ్లీచింగ్ చల్లించారు.నేడు మంచేపల్లి గ్రామానికి త్రాగు నీటీ పైపులైను వేయించినీటీ సమస్యను తీర్చారు. సర్పంచ్ యర్రమ్మ, ఆమె కుమారుడు వైసీపీ మండల యువ కన్వీనర్ గజేంద్ర దగ్గర ఉండి పనులను పర్యవేక్షించారు. తమ సమస్యను తీర్చిన సర్పంచ్ కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సమగ్ర విచారణ జరిపి భక్తుల మనోభావాలు కాపాడాలి

- ఉరవకొండ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గుర్రం సుధాకర్

ఉరవకొండ, మార్చి 22 ప్రభాతవార్త



మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గుర్రం సుధాకర్

పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి ఆలయంలో ఈనెల 18న హుండీ లెక్కింపు రోజు నిలువు దోపిడి బంగారు, వెండి నగల మూట కాజేయాలని జరిగిన ప్రయత్నంపై దేవాదాయశాఖ ఉన్నతాధికారులు సీరియస్ గా తీసుకొని సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకొని భక్తుల మనోభావాలను కాపాడాలని ఉరవకొండ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గుర్రం సుధాకర్ కోరారు. శనివారం ఆయన స్థానిక విలేఖ రులతో మాట్లాడారు. లక్ష్మినరసింహస్వామి ఆలయానికి ఎంతో విశిష్టత, పవిత్రత ఉందని వేలు, లక్షలాదిమంది భక్తులు స్వామివారికి ఇంటి దేవుడిగా కొలుస్తారని దాన్ని దెబ్బతీయాలని ఎవరూ ప్రయత్నించినా ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయంలో గత కొన్ని సంవత్స రాలుగా అనేక అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని భక్తులు స్వామివారికి సమర్పించే నగలు, నగదు, కానుకలు కాజేస్తున్నారన్న ఆరోపణలు అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధనార్జనే ధ్యేయంగా అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులెవరో గుర్తించి వారిపై చర్యలు తీసుకోకపోతే భక్తుల మనోభావాలు దెబ్బతింటాయన్నారు. హుండీ లెక్కింపు దేవాదాయశాఖ జిల్లా ఏసీ పర్యవేక్షణలో, ఆలయ ఈవో ఆధ్వర్యంలో హుండీ లెక్కింపులో పాల్గొన్న దాదాపు వంద మంది భక్తులు, ఆలయ సిబ్బంది సమక్షంలోనే నగల మూట మాయమై తిరిగి ప్రత్యక్షం కావడం విస్మయానికి గురి చేస్తోందన్నారు. ఇది పథకం ప్రకారమే జరిగిన వ్యవహారంగా తెలుస్తోందని ఈ వ్యవహారంలో ఎవరెవరు భాగస్వాముల యా ్యరో నిజాలు నిగ్గు తేల్చాల్సిన అవసరం ఆశాఖ ఉన్నతాధికారులపైనే ఉందన్నారు. భక్తుల మనోభావాలతో ముడిపడివున్న శ్రీవారి వారి నూతన రథం నిర్మాణాన్ని వేగవంతం చేసి త్వరితగతిన పూర్తీ చేయాలని గుర్రం సుధాకర్ ప్రభుత్వాన్ని కోరారు.

## పెన్నహోబిళంలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరుపాలి

- సంవత్సరాలు పాతుకుపోయిన సిబ్బంది, అర్చకులను బదిలీ చేయాలి

-విలేఖరుల సమావేశంలో సీపీఎం నాయకుల డిమాండ్



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఉరవకొండ, మార్చి 23 ప్రభాతవార్త

మండల పరిధిలోని పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి ఆలయంలో ఆమిద్యాల గ్రామానికి చెందిన భక్తురాలు హుండీలో వేసిన నిలువు దోపిడి బంగారం కాజేసే యత్నం ఘటన, అక్కడ జరుగుతున్న అక్రమాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి ్ర రంగారెడ్డి, మండల కార్యదర్శి మధుసూదన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆలయంలో గత కొన్ని సంవత్సరాలుగా అక్రమలు, భక్తులు స్వామివారికి సమర్పించిన విరాళాలు, కానుకలు, ఆభరణాలు, వస్తువుల దోపిడి కొనసాగుతోందన్నారు. దొంగలను పసిగట్టడంతో అక్కడ పనిచేస్తున్న అధికారులుగాని, అర్చకులుగాని విఫలం కావడంబట్టి చూస్తే వారి ప్రమేయంతోనే ఇదంతా జరుగుతోందని అనుకోవాల్సి వస్తోందన్నారు. ఏ ప్రభుత్వ శాఖలోనైనా ఉద్యోగులు మూడు సంవత్సరాలకు మించి ఒకేచోట పనిచేయడం కూదరని అయితే పెన్నహోబిళంలో మాత్రం అధికారులు, సిబ్బంది అక్కడే పాతుకుపోయి రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోవుంటే వారి కొమ్ముకాస్తూ అక్కడే మకాం వేస్తూ అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని ఇదంతా తెలిసినా ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. నూతన రథం నిర్మాణానికి సంబంధించి కోట్లాది రూపాయలు విరాళాలు భక్తుల నుండి వస్తున్నప్పటికీ రథాన్ని తయారు చేయించడంలో విఫలమయ్యారని దీంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. ఆలయంలో సంవత్సరాలుగా పాతుకుపోయిన ఉద్యోగులను తప్పించి కొత్తవారిని నియమించి ఆలయ పవిత్రతను, భక్తుల మనోభావాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ పెద్దలపై ఉందన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు మురళీ, వీరాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ రాయితీపై అదనపు లోడు క్రమబద్ధీకరణ

ధర్మవరం రూరల్ మార్చి 22 ప్రభాతవార్త

గృహ వినియోగదారులకు అదనపు లోడు క్రమబద్ధీకరణకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం 50 శాతము రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ధర్మవరం విద్యుత్ ఏడి లక్ష్మీనరసింహారెడ్డి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ మండల కేంద్రాలు పట్టణ పరిధిలోని మూడు కిలో వాట్లకు దరఖాస్తు చేసుకునేలా ముందుగానే సంబంధిత విద్యుత్ అధికారులు వినియోగదారులకు సూచించడం జరిగిందని తెలిపారు. అదనపు లోడు అనగా కొత్తగా కనెక్షన్ తీసుకునే సమయంలో గృహోపకరణాల వినియోగాన్ని అంచనావేసి కిలోవాట్లలో లెక్కిస్తామని తెలిపారు. ఈ మేరకే డెవలప్మెంట్ చార్జీలు సెక్యూరిటీ డిపాజిట్ వసూలు చేయడం జరుగుతుందన్నారు. గ్రామ మండల కేంద్రాలలో కనీసం రెండు సింగల్ వాట్లు, పట్టణాలలో 3 కిలోవాట్ల ఉంటుందన్నారు. ఈ అవకాశం జూన్ 30 వరకు ప్రభుత్వము కల్పించిందని, దరఖాస్తులు ఆన్లైన్ లేదా విద్యుత్ కార్యాలయాలలో అందుబాటులో ఉంటాయని వారు తెలిపారు. కావున వినియోగదారులు ముందుకొచ్చి సర్వీసును క్రమబద్ధయించుకోవాలని తెలిపారు.

## పారం పండ్స్ ప్రారంభించిన టిడిపి నేతలు

బ్రహ్మ సముద్రం, మార్చ్ 21 ప్రభాతవార్త

మండల పరిధిలోని బైర సముద్రం గ్రాము నందు గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన పారం పాండ్స్ గుంతలను భూమిపూజ చేసి ప్రారం భించారు.సదరు పారం పాండ్స్ గుంతల వలన వర్షానికి వచ్చు నీటిని గ్నుటలలో నిలువరించడం ద్వారా భూగర్భ జలాలు అడుగంటి పోకుండా అభివృద్ధి చెందుతాయని తద్వారా రైతులకు బోర్ల యందు నీటి జలం అభివృద్ధి చెంది రైతులకు యొక్కబోర్ల యందు నీరు అడుగంటి పోకుండా అభివృద్ధి చెందుతాయని తద్వారా రైతులకు ఉపయో గం ఉంటుందని తెలియ చేశారు ఈ కార్య క్రమంలో ఉపాధిహామీ పథకం కూలీలు స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఫారం ప్రారంభిస్తున్న దృశ్యం

## అంగన్‌వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

- కంపు కొడుతోంది శుభ్రంగా ఉంచుకోండి

- జడ్పిటిసి ఉమేష్



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న జడ్పిటిసి

అగళి, మార్చి 22 ప్రభాతవార్త

కరిదాసన పల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని జడ్పిటిసి ఉమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులకు పెట్టిన భోజనాన్ని పరిశీలించడంతోపాటు కోడిగుడ్లను పంపిణీ చేస్తున్నారా లేదా, పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం కంపుకొడుతోందని, దీనిని శుభ్రంగా ఉంచుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తకు సూచించారు. గర్భిణీలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కోడిగుడ్లతోపాటు బియ్యం పాకెట్లు, పప్పుది నుసులు, నూనె, పాలు తదితర వాటిని గర్భవతులకు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్ రూపతోపాటు గర్భిణీలకు వ్యాక్సినేషన్ చేస్తున్న ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, టిడిపి నాయకులు రమేష్‌లు ఉన్నారు. ఎంఎల్‌హెచ్‌పిలు బిక్షావతి, నవీనలు ఉన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జడ్పిటిసి

## మూస మెడికల్స్‌ను తనిఖీ చేసిన జిల్లా డ్రగ్ ఇనిస్పెక్టర్



తనిఖీలు చేపడుతున్న డ్రగ్ ఇనిస్పెక్టర్ హనుమన్న.

రాయదుర్గం, మార్చి 22 ప్రభాతవార్త:

పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఉన్న ఆర్ఎంపి ఖలీల్ క్లినిక్‌లో వైద్యం వికటించి మూడేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటనలో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. జిల్లా డ్రగ్ ఇనిస్పెక్టర్ హనుమన్న పట్టణంలోని ఖలీల్ ఆర్ఎంపి వైద్యులుగా నడుపుతున్న మూసా మెడికల్స్‌ను శనివారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. మీడియాకు ఎటువంటి సమాచారం వెల్లడించకపోవడంతో విలేఖర్లు అధికారిపై ప్రశ్నల వర్షం కురిపించారు.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీకి వచ్చామని, నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

## ఉడేగోళం చెరువులో ప్లాస్టిక్ ఏరివేత....




మాట్లాడుతున్న ఎన్సిసి ఏఎన్ఓ కిరణ్ జక్కల

రాయదుర్గం రూరల్, మార్చి 22 ప్రభాతవార్త:

పట్టణ సమీపంలోని కేటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్సిసి యూనిట్ , ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకొని కళాశాలకు ఆనుకుని ఉన్న ఉడేగోళం చెరువుని శుభ్రపరిచారు. చెరువులో ఉన్న దుస్తులు మరియు ప్లాస్టిక్ వస్తువులను ఒకచోట చేర్చి దూరంగా పారివేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్సిసి ఏఎన్ఓ కిరణ్ జక్కల మాట్లాడుతూ నీటి కుంటలు, నీటి చెరువులు మన దేశం యొక్క వారసత్వ సంపద అని, వాటిని కలుషితం కాకుండా కాపాడుకోవడం ప్రతి మానవుని యొక్క కర్తవ్యమని తెలిపారు. కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నీటిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరికి కర్తవ్యం అని భవిష్యత్తులో నీటి యుద్ధాలు జరిగే అవకాశం ఉందని, నీటి యొక్క ప్రాముఖ్యతను చెప్పారు.

## మాదిగలకు ఇచ్చిన మాట ముఖ్యమంత్రి నిలబెట్టుకున్నారు

- వారికి జీవితాంతం రుణపడి ఉంటాము - మాదిగ సోదరులు

అగళి, మార్చి 22 ప్రభాతవార్త



చంద్రబాబు, మందకృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని, మాదిగ జాతి ఎప్పుడూ చంద్రబాబుకు రుణపడి ఉంటుందని, ఏని శాసనసభలో ఏబిసిడి వర్గీకరణ కోసం బిల్లును అమలు చేశారని, అందుకే చంద్ర బాబునాయుడుకి రుణపడి ఉన్నామని మాదిగ సోదరులు అన్నారు. అగళి బస్టాండ్‌ప్రాంతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటంతోపాటు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి, అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ నాయకులకు ఎప్పుడు రుణపడి ఉంటామని తెలిపారు. మండలంలోని రైతు సోదరులు, విద్యార్థులు, మేధావులు, ఉద్యోగస్తులు అందరూ కాలిసి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పిఎస్ నాయకులు మల్లేష్, భూతరాజు, శివన్న, చిగనాగప్ప, లోకేష్, నాగోజి, రాయుడు, లింగన్న, వీరఖ్యాత, మూర్తి, ఖ్యాతప్ప, నాగభూషణ్ తదితరులు ఉన్నారు.

## వేసవిలో తాగునీటి సమస్యపై దృష్టి సారించండి

ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డి

తాడిమర్రి మార్చి 22 (ప్రభాతవార్త)

తాడిమర్రి మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పార్టీ భువనేశ్వర్ రెడ్డి అధికారులకు సూచించారు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు మండలంలోని కొన్ని సమస్యలపై సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వాటిని సకాలంలో పరిష్కరించాలని ఎంపీడీవో రంగారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, జడ్పిటిసి, ఎంపీటీసీలు,సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డి

## ఎల్‌ఎల్‌సీకి ఏప్రిల్ 10 వరకు నీరు.....

- తుంగభద్ర ఐసీసీ సభ తీర్మానం - బళ్లారి జిల్లా రైతుల హర్షం



బెంగళూరు విధానసౌధలో మంత్రి శివరాజ్ తంగడిగి అధ్యక్షతన తుంగభద్ర నీరావరి సమితి సభలో ఎల్‌ఎల్‌సీకి నీటి విడుదలపై చర్చ జరుపుతున్నప్పటి దృశ్యం

బళ్లారి, మార్చి22, ప్రభాతవార్త;

రబీ సీజన్‌లో జిల్లాలో తుంగభద్ర ఎల్‌ఎల్‌సీ ఆయకట్టు భూముల్లో వందలాది ఎకరాల్లో రైతులు వేసుకున్న వరి పంటను ఆదుకునేందుకు, తాగునీటికి తుంగభద్ర జలాశయం నుంచి ఎల్‌ఎల్‌సీకి వచ్చే ఏప్రిల్ 10వ తేదీ వరకు నీరు వదిలేందుకు తుంగభద్ర ఐసీసీ సభ తీర్మానించింది. బెంగళూరు విధానసౌధలో శుక్రవారం సాయంత్రం కొప్పళ ఇన్‌చార్జి మంత్రి శివరాజ్‌తంగడిగి అధ్యక్షతన జరిగిన 123వ తుంగభద్ర ఐసీసీ అత్యవసర సభలో ఈ నిర్ణయం ప్రకటించారు. రాయచూరు వైపుకు వెళ్లే తుంగభద్ర ఎడమ ముఖ్య దిగువ కాలువకు 3 వేల క్యూసెక్కులు, ఎల్‌ఎల్‌సీ కాలువకు 450 క్యూసెక్కుల ప్రకారం ఏప్రిల్ 10వ తేదీ వరకు నీటి సరఫరా జరుగుతుందని తెలిపారు. రైతుల డిమాండ్ మేరకు వరి పంటను కాపాడేందుకు ఐసీసీ సభ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తుంగభద్ర రైతుసంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తంగౌడ తెలిపారు. విజయనగర కాలువ 11వ డిస్టిబ్యూషన్ వరకు ఏప్రిల్ 11 నుంచి మే 10వ తేదీ వరకు నీటి సరఫరా జరుగుతుంది. రాయబసవన్న కాలువకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు లభ్యమయ్యే నీటిలో 200 క్యూసెక్కుల ప్రకారం నీటిని వదలడం జరుగుతుందని సభలో మంత్రి శివరాజ్‌తంగడిగి వెల్లడించారు. తమ ప్రభుత్వం రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా వారి వెన్నంటి ఉండి, కష్ట నష్టాలకు స్పందిస్తుందన్నారు. ఈసారి ఉత్తమ రీతిలో వరి పంట మంచి దిగుబడి రావాలన్న ఉద్దేశ్యంతో ఏప్రిల్ 10వ తేదీ వరకు నీరు విడుదల చేయడం జరుగుతుందని, సదరు కాలువ పరిధిలో గల గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి సౌలభ్యం కూడా కల్పించడం జరుగుతుందన్నారు.

## కర్ణాటక బంద్‌కు మద్దతుగా కరవే కార్యకర్తల ప్రతిఘటన

బళ్లారి, మార్చి22, ప్రభాతవార్త;



తహసీల్దార్ గురురాజ్‌కు వినతి పత్రం అందజేస్తున్న కర్ణాటక రక్షణ వేదిక కార్యకర్తలు

కర్ణాటకలో కన్నడిగులకు ఉద్యోగావకాశాలు, కేంద్రం నుంచి జీఎస్టీ, కర్ణాటక వాటా నిధులు కేటాయింపు, మహాదాయి-మేకెదాటు నీరావరి ప్రాజెక్టులు, జిందాల్ స్టీల్ ప్లాంట్‌లో కన్నడిగులకు 80 శాతం ఉద్యోగాల కల్పన, తుంగభద్ర సమాంతర జలాశయం నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ కర్ణాటక రక్షణ వేదిక నగరంలో ప్రతిఘటన చేపట్టింది. వేదిక అధ్యక్షుడు జి.రాజశేఖర్, పదాధికారులు, వందలాది మంది కార్యకర్తలు స్థానిక రాయల సర్కిల్‌లో చేరి ప్రతిఘటన జరిపారు. రాష్ట్రవ్యాప్తంగా శనివారం పిలుపునిచ్చిన కర్ణాటక బంద్‌కు మద్దతు తెలిపిన ప్రదర్శనకారులు అనంతరం జిల్లాధికారి కార్యాలయానికి చేరుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు రాసిన వినతి పత్రాన్ని డి.సి. కార్యాలయంలో తహసీల్దార్ గురురాజ్‌కు అందజేశారు. బెళగావి నగరంలో ఎంఈఎస్‌కు చెందిన కార్యకర్తలు పదేపదే కన్నడ ప్రజలపై దౌర్జన్యం, దాడులకు పాల్పడుతున్నారని, బెళగావి సరిహద్దులో కర్ణాటక-మహారాష్ట్ర బోర్డర్‌లో కర్ణాటక ఆర్టీసీ బస్సుల డ్రైవర్లపై అనవసరంగా దాడి చేస్తుండడాన్ని ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా కర్ణాటక బంద్‌కు వివిధ కన్నడ సంఘాల సంయుక్త సమితి ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునివ్వడం జరిగింది. అయితే మైసూరు, మండ్యా జిల్లాల మినహా ఎక్కడా బంద్‌కు ప్రజల నుంచి స్పందన లభించలేదు. ప్రభుత్వం బంద్‌కు ఎటువంటి అనుమతి ఇవ్వకపోగా, అన్ని బస్సులు, వాహనాల సంచారం యదావిధిగా నడవాలని ఆదేశాలు జారీ చేయడంతో యదావిధిగా ప్రజలు తమతమ విధులకు హాజరయ్యారు. వ్యాపారులు, షాపులు, హోటళ్లు తెరుచుకోవడం కనిపించింది. బస్సుల సంచారం కొనసాగింది. ముందు జాగ్రత్త చర్యగా పోలీసుల పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో రోడ్లపై ప్రతిఘటనకు దిగిన కార్యకర్తల్ని వెంటనే అరెస్టు చేసిన ఘటనలు రాష్ట్రంలో కొన్ని చోట్ల జరిగింది. బళ్లారి నగరంలో ప్రదర్శనకారులు కర్ణాటక బంద్‌కు పిలుపునిస్తూ ప్రతిఘటన జరిపినట్లు, కన్నడిగులకు న్యాయం చేసేంతవరకు తాము పోరాటం జరుపుతామని, కన్నడిగుల హక్కుల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించాలని రాజశేఖర్ తదితరులు డిమాండ్ చేశారు.

## హిందూ-ముస్లిం సోదరుల భావైక్యతకు ప్రతీక ఇఫ్తార్ విందు

- మాజీ మంత్రి బి.శ్రీరాములు

బళ్లారి, మార్చి22, ప్రభాతవార్త;



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ మంత్రి బి.శ్రీరాములు

రంజాన్ పండగ సందర్భంగా ముస్లిం సోదరులు 30 రోజులపాటు ఉపవాస దీక్షలు ఆచరిస్తారని, రోజంతా ఉపవాసంతో ఉన్న ముస్లిం సోదరులకు హిందూ సోదరులు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి, వారి ఆకలి తీర్చి భావైక్యతను చాటి చెబుతున్నారని మాజీ మంత్రి బి.శ్రీరాములు తెలిపారు. బళ్లారి జిల్లా జేడీఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ముస్లిం సోదరులకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి హాజరైన మాజీ మంత్రి బి.శ్రీరాములు కార్యక్రమాన్ని ప్రారంభించి, ముస్లిం సోదరులకు స్వయంగా తానే వడ్డించి భోజనం పెట్టారు. జిల్లా జేడీఎస్ అధ్యక్షుడు మీనళ్లి తాయన్న తదితర నాయకులు కార్యక్రమానికి హాజరై పరస్పరం ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకుని, రంజాన్ పండగను ఘనంగా జరుపుకోవాలని అభిలాష వ్యక్తం చేశారు. మాన్వీ క్షేత్రం జేడీఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటపయ్యనాయక్, పుష్ప, వండ్రి, శివనారాయణ, రఫిక్, జమీల తదితర పార్టీ పదాధికారులు, ముస్లిం ధర్మ గురువులు, నాయకులు పాల్గొన్నారు.

## కస్తూరిబా పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గోరంట్ల మార్చి 21 ప్రభాతవార్త

గోరంట్ల మండల కేంద్రంలోని ఖాజాపురం గ్రామం వద్ద వున్న కస్తూరిబా పాఠశాలలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శిరీష తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి నుండి 11వ తరగతుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 6వ తరగతికి 40 సీట్లు, ఇంటర్మీడియట్ సిఇసి గ్రూప్‌లో కేవలం 40 సీట్లు మాత్రమే వున్నాయన్నారు. ఖాళీగా వున్న సీట్ల కోసం బాలికలు ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాప్ అవుట్, బడి మానేసిన వారు పేద, ఎస్సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, బిపిఎల్ తదితరులు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణిస్తామని, ఎంపికైన విద్యార్థులకు ఫోన్, మేసేజ్ ద్వారా సమాచారం అందచేస్తామన్నారు. మరిన్ని వివరాలు స్థానిక పాఠశాల ఆవరణలోని నోటీస్‌బోర్డులో వుంటాయని ఎవరైనా నేరుగా అక్కడికి వెళ్లి చూసుకోవచ్చని ఆమె తెలిపారు.

